క్లుప్తంగా

బుజ్జమ్మరేవులో కార్డన్ సెర్చ్


అనుమానితుల వేలిముద్రలను సేకరిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో సంతపేటలోని బుజ్జమ్మరేవులో కార్డన్ సెర్చ్‌ను స్థానిక పోలీసులు శుక్రవారం నిర్వహించారు. నగర డీఎస్పీ సింధుప్రియ పర్యవేక్షణలో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు తన సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బుజ్జమ్మరేవులోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని 31 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. ఇద్దరు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడారు. కార్డన్ సెర్చ్‌లకు ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మత్తు, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు తదితరాలపై డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేస్తే జరిమానా


సూచనలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలో ఇంటింటికీ వచ్చే చెత్త సేకరణ వాహనాలకే వ్యర్థాలను అందించాలని, అలా కాకుండా బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. నగరంలోని 36వ డివిజన్ ఫతేఖాన్‌పేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

• సచివాలయాల పరిధిలో నూతన భవన నిర్మాణాలు జరిగేందుకు ప్లానింగ్ కార్యదర్శులు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ నందన్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లను దాఖలు చేయాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లను నిర్మాణ స్థాయిలోనే గుర్తించి, అనుమతుల్లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని పేర్కొన్నారు. సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ నరేంద్ర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో పాటు ఆటలూ అవసరం

పొదలకూరు: కిశోర బాలికలకు శారీరక వ్యాయామంతో పాటు ఆటలూ అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. కిశోరి వికాసం – వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసంతో పాటు శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఏఎన్‌ఎం కృష్ణమ్మ, చైతన్య, సుమాంజలి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పేర్కొన్నారు. మండలంలోని పిడూరు మిక్స్‌డ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలిక సంరక్షణ చట్టాలు, పరిసరాల పరిశుభ్రత, గుడ్, బ్యాడ్ టచ్ తదితరాలపై అవగాహన కల్పించారు. రోజూ 30 నిమిషాలను వ్యాయామం, ఆటలకు కేటాయించాలని కోరారు. అంగన్‌వాడీలు మహాలక్ష్మి, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: కౌమార దశలో రోజూ అరగంట పాటు వ్యాయామం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ సూచించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వ్యాయామ ఆవశ్యకతపై మండలంలోని గండవరం దర్గా సంఘంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్త ఉమా తదితరులు పాల్గొన్నారు.

⇒ మండలంలోని రామాపురం ఎన్టీఆర్ గిరిజన కాలనీలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. రోజూ అరగంట వ్యాయామం చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్త రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరు: గండవరం దర్గా సంఘంలో వ్యాయామంపై శిక్షణ


పొదలకూరులో..


మనుబోలు: పిడూరు మిక్స్‌డ్ కాలనీలో..


కొడవలూరు: రామాపురంలోని ఎన్టీఆర్ కాలనీలో..

అపహరణకు గురైన నగదు చెత్తకుప్పలో లభ్యం


నగదును అప్పగించిన సురేష్‌ను అభినందిస్తున్న ఎస్సై

పొదలకూరు: అపహరణకు గురైన నగదు చెత్తకుప్పలో లభ్యమైంది. వివరాలు.. బ్యాంక్‌లో నగలను రైతు వరికూటి రామకృష్ణారెడ్డి కుదువ పెట్టి రూ.86 వేలను తీసుకున్నారు. ఈ మొత్తాన్ని బైక్‌లో పెట్టుకొని వెళ్తుండగా, స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో అపహరణకు గురైంది. ఈ క్రమంలో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. చోరీకి పాల్పడింది ఓ యువకుడిగా గుర్తించారు. నగదును తస్కరించిన దొంగ పట్టణంలోని నాగార్జున స్కూల్ వీధి మీదుగా వెళ్తూ ఓ ఇంట్లోని చెత్తలో నగదు కవర్‌ను పడేసి ఉడాయించారు. ఈ తరుణంలో చెత్తను సేకరించేందుకు పంచాయతీ వాహనం రాగా, ఈ కవర్‌ను రాయదుర్గం సురేష్ గుర్తించారు. కవర్లో ఉన్న ఫోన్ నంబర్ ద్వారా రైతుతో మాట్లాడారు. నగదును అప్పగిస్తానని, దీనికి గానూ పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. వెంటనే రైతు రామకృష్ణారెడ్డి, ఆయన బంధువులు స్టేషన్‌కు చేరుకోగా, ఎస్సై హనీఫ్ సమక్షంలో ఈ మొత్తాన్ని సురేష్ అప్పగించి తన నిజాయతీని చాటుకున్నారు. దీంతో ఎస్సై సత్కరించి, రూ.వెయ్యి క్యాష్ రివార్డును అందజేశారు. కాగా నగదును అపహరించిన యువకుడు ఎవరనేది తేలలేదు.

నార్తురాజుపాళెంలో మూడిళ్లలో చోరీ

• ఐదు సవర్ల బంగారం, రూ.ఏడు వేల నగదు అపహరణ


పరిశీలిస్తున్న కోటిరెడ్డి

కొడవలూరు: మండలంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. ఎవరూ లేని ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని గడియలను పగలగొట్టి నగలు, నగదును దోచుకెళ్లారు. నార్తురాజుపాళెంలోని మహాలక్ష్మమ్మ గుడి వీధిలో ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఒక ఇంట్లోని బీరువాను పగలగొట్టి అందులోని ఐదు సవర్ల బంగారం.. మరో ఇంట్లో రూ.ఐదు వేలు, సమీపంలోని గృహంలో రూ.రెండు వేలను అపహరించుకెళ్లారు. మరో ఇంట్లో చోరీకి యత్నించగా, నగలు, నగదు లభ్యం కాకపోవడంతో వస్తువులను చిందరవందర చేసి వెళ్లారు. ఈ మేరకు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాలను ఎస్సై కోటిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



ప్రశంసపత్రాలతో విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నవతరానికి గ్రంథాలయాలు దిక్సూచి అని ఎంఈఓ వెంకటరత్నం పేర్కొన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిర ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలకు రావడం ద్వారా మంచి గుణాలు అలవాటవుతాయని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

⇒ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా అందించాలని ఎంఈఓ సూచించారు. పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. మెనూ మేరకు భోజనాన్ని అందించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ సుధీర్‌కుమార్, హెచ్ఎం బాలకేశవులు, ఉపాధ్యాయుడు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పులి వాహనంపై అమ్మవారి విహారం



ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారు పులి వాహనంపై శుక్రవారం విహరించారు. అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉభయకర్తలుగా గంగపట్నానికి చెందిన మూలగల ప్రదీప్, మాధవి, పుల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, మంజుల, ప్రవాస భారతీయులు సోమరాజుపల్లి కార్తీక్‌సాయి, అంకిత దంపతులు వ్యవహరించారు. చప్పరోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. అర్చకులు అనిల్, రామకృష్ణ, కిశోర్ తదితరులు పర్యవేక్షించారు.

కోలాట భజన గురువు మృతి


నివాళులర్పిస్తున్న పూజిత

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరుకు చెందిన కోలాట భజన గురువు చెన్నూరు సుబ్బారెడ్డి (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతగా.. కాకాణి కుటుంబానికి వీరాభిమానిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో ఆయన భౌతికకాయానికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నూరు విజయలక్ష్మి, నేతలు శ్రీనివాసులురెడ్డి, రెడ్డిచర్ల అంకిరెడ్డి, ఆకుల గంగిరెడ్డి, చెన్నూరు గంగిరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విష్ణాలయంలో విశేష పూజలు



మనుబోలు: స్థానిక శ్రీదేవీ, భూదేవీ సమేత విష్ణాలయంలో విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. అభిషేకాలు, పూజలను అర్చకుడు మాధవగిరి హనుమాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం సుప్రభాత సేవను నిర్వహించి.. మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్నపన తిరుమంజనం, తులసీదళార్చనను జరిపారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా సాయికుమార్‌రెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు.

వైఎస్సార్సీపీ నేతకు పరామర్శ



వెంకటాచలం: మండలంలోని కసుమూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత హుస్సేన్ భార్య హుస్నా (35) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత కసుమూరుకు వచ్చి హుస్నా మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ నిబంధనలు పాటించాలి

మనుబోలు: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కోవిడ్ నిబంధనలను పాటించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మాస్కులను ధరించడంతో పాటు చేతులను తరచూ శుభ్రపర్చుకోవాలని సూచించారు. లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని కోరారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..

నెల్లూరు(బృందావనం): నగరంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారిని రాష్ట్ర ఫైర్ సర్వీస్ డైరెక్టర్ మురళీమోహన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వేదపండితులు, అర్చకులు వీరికి స్వాగతం పలికారు. ఖడ్గమాల పూజలు జరిపిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి పరామర్శ



నెల్లూరు సిటీ: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న క్రమంలో ఆయన్ను కలిశారు.

మూల్యాంకనంలో అవకతవకలపై చర్యలకు వినతి


డీఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రితరెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఫీజును వసూలు చేయకుండానే ప్రతి విద్యార్థి జవాబుపత్రాలను మరోసారి మూల్యాంకనం చేయాలని కోరారు. విద్యార్థి విభాగ నెల్లూరు రూరల్, కావలి, సర్వేపల్లి, సూళ్లూరుపేట అధ్యక్షులు రోహిత్‌రెడ్డి, శ్యామ్, హేమంత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

• ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సరైన భవనాల్లేకుండానే అడ్మిషన్లను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

• ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సునీల్, షారూఖ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశీర్వాదం, హర్ష, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు షురూ..

డీఎస్సీ పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు కేంద్రాల్లో పరీక్షను ఆన్‌లైన్లో నిర్వహించారు. ఎండ తీవ్రతతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయాన్ని కల్పించడాన్ని విస్మరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



పరీక్ష రాసి వస్తున్న దివ్యాంగులు




చివరి నిమిషంలోనూ సన్నద్ధమవుతూ..


ఎండ తీవ్రతకు అవస్థ పడుతూ..